సాక్షి అనంతపురం

సోమవారం ၊ 11 ၊ నవంబర్ ၊ 2024



టమాట కిలో రూ.23

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక పాలన

రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక పాలన సాగుతోందని ఏఐయూటీయూసీ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు సోమశేఖర్ విమర్శించారు.

8లో

గరిష్టం/కనిష్టం

35.1°/18.5°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. తూర్పు దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ముగిసిన గ్లోబల్ అఖండ భజన



సాయికుల్వంత్ సభా మందిరంలో గీతాలు ఆలపిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: విశ్వశాంతిని కాంక్షిస్తూ చేపట్టిన సత్యసాయి గ్లోబల్ అఖండ భజన ఆదివారం సాయంత్రం ముగిసింది. 24 గంటల పాటు ప్రపంచ నలుమూలలా ఉన్న సత్యసాయి సేవా సంస్థలు ఉమ్మడిగా చేపట్టిన అఖండ భజన కార్యక్రమంలో లక్షలాది మంది సత్యసాయి భక్తులు పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా ప్రశాంతి నిలయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు చక్కటి భక్తిగీతాలతో భజన కొనసాగించారు. భక్తులకు అన్న ప్రసాదాల వితరణ చేశారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ఉన్న 11 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు మండిపడ్డారు. ఆదివారం అనంతపురంలోని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న విద్యా రంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీని నియమించి, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలన్నారు. యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యా శాఖ మంత్రి ఇచ్చిన హామీ మేరకు జీఓ 117 వెంటనే రద్దుచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ. 21 వేల కోట్ల బకాయిలను మంజూరు చేయాలన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి పాఠశాల సహాయకులకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. జీపీఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. 500 మంది విద్యార్థులు పైబడిన ఉన్నత పాఠశాలలకు బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను తగ్గించాలని, ఎంఈఓ -1,2లకు సమాన అధికారాలను ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు జి. సూర్యుడు, కె. చంద్రశేఖర్, ఫణి భూషణ్, శివయ్య ఆచారి, మహమ్మద్ రఫీ, జి. కిషోర్, జి. మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో గంజాయి బ్యాచ్ హల్‌చల్



క్రిష్టాపురం 5వ రోడ్డు కాలనీవాసులతో మాట్లాడుతున్న పోలీసులు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలో ఆదివారం రాత్రి గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేసింది. స్థానిక క్రిష్టాపురం 5వ రోడ్డు కాలనీవాసులను భయభ్రాంతులకు గురి చేసింది. ప్రశ్నించిన స్థానికులపై పోకిరీలు దాడులకు తెగబడ్డారు. ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశారు. దీంతో కాలనీవాసులు స్థానికంగా నివాసముండే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనిదెల రమేష్‌రెడ్డిని ఆశ్రయించగా, ఆయన పోలీసులకు సమాచారం చేరవేశారు. ఈ క్రమంలో వారు కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. నెల రోజులుగా మద్యం, గంజాయి మత్తులో కొందరు యువకులు కాలనీలోకి వస్తున్నట్లు స్థానికులు తెలిపారు. కర్రలు పట్టుకుని ద్విచక్రవాహనాలపై తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. రాళ్లను ఇళ్లపైకి విసురుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ నేత రమేష్ రెడ్డి తెలిపారు.

గోకులం.. పచ్చపాతం!

- రాయదుర్గం మండలం డీ.కొండాపురం పంచాయతీకి చెందిన ఓ రైతు మినీ గోకులం షెడ్డు కోసం దరఖాస్తు చేశాడు. ఇతనికి రెండు పశువులు ఉన్నాయి. ప్రభుత్వం విధించిన అన్ని అర్హతలు ఉన్నా షెడ్ల మంజూరు లిస్టులో పేరు లేదు. కారణమేంటని ఆరా తీస్తే టీడీపీ నేతలు ఇచ్చిన లిస్టులో ఇతని పేరు లేదని తెలిసింది.
- డీ హీరేహాళ్ మండలంలోని గొడిశలపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త గోకులం షెడ్డు కోసం దరఖాస్తు చేస్తే మంజూరు కాలేదు. కూటమి నాయకులు ఇచ్చిన జాబితానే అధికారులు ఓకే చేయడంతో ఇలా జరిగినట్లు తేలింది. ఈ రెండు చోట్లే కాదు జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి.

అర్హులకు మొండిచెయ్యి

- టీడీపీ నేతల సిఫార్సులకే పెద్దపీట
- వారి అనుయాయులకే 95 శాతం యూనిట్ల మంజూరు



మినీ గోకులం పథకం వివరాలు ఇలా..			
షెడ్ల పరిధి	యూనిట్ విలువ	రాయితీ	రైతు చెల్లించాల్సింది
2 పశువులు	రూ.1,15,000	రూ.1,03,500	రూ.11,500
4 పశువులు	రూ.1,85,000	రూ.1,66,500	రూ.18,500
6 కంటే ఎక్కువ	రూ.2,30,000	రూ.2,07,500	రూ.23,000
20 గొర్రెలు, మేకలు	రూ.1,30,000	రూ.91,000	రూ.39,000
50 గొర్రెలు, మేకలు	రూ.2,30,000	రూ.1,61,000	రూ.69,000
100 కోళ్లు	రూ. 87,000	రూ.60,900	రూ.26,100
200 ఉంటే	రూ. 1,32,000	రూ.92,000	రూ.39,600

జిల్లాలో పశుసంపద వివరాలు

- ఆవులు 2.16 లక్షలు
- గేదెలు 1.09 లక్షలు
- గొర్రెలు 22.94 లక్షలు
- మేకలు 4.12 లక్షలు
- పౌల్ట్రీ 10.36 లక్షలు

రాయదుర్గం: అర్హులందరికీ పథకాల ఫలాలు అందజేస్తామంటూ సభలు, సమావేశాల్లో ఊదరగొడుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాటలు క్షేత్రస్థాయిలో నెరవేరడం లేదు. జిల్లాలో మినీ గోకులం షెడ్ల మంజూరును పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది. జిల్లాకు ప్రభుత్వం 1,470 మినీ గోకులం షెడ్లు మంజూరు చేయగా, ఇందులో 1,433 షెడ్లకు అనుమతులు లభించాయి. ఇప్పటికే 148 షెడ్లకు మార్కింగ్ ఇచ్చారు. 22 నిర్మాణాలు పూర్తి చేసినట్టు రికార్డులు చెబుతున్నాయి. పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన రైతులకు అందించకుండా పక్షపాత వైఖరి ప్రదర్శిస్తూ 95 శాతం షెడ్లను టీడీపీ అనుయాయులకే కట్టబెట్టడం విమర్శలకు తావిస్తోంది. వీటి పంపకాల్లోనూ కొన్నిచోట్ల నేతల మధ్య ముష్టిఘాతాలు జరిగినట్టు తెలుస్తోంది. దాణా ఖర్చులు పెరగడం, పాల ధర లాభసాటిగా లేకపోవడం వెరసి పశు పోషణపై రైతుల్లో ఆదరణ తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో పాడి రైతులకు తమ వంతు ప్రోత్సాహం అందించేలా మినీ గోకులాల పేరిట కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన షెడ్లనూ పచ్చ నేతలు పంచుకోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

పథకం అమలు ఇలా..

మినీ గోకులాలకు ఎస్సీ, ఎస్టీ, వలస, ఇతర తెగల రైతులు అర్హులు. వీరితో పాటు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు, మహిళలు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఉంటుంది. పీఎంజీఎస్‌వై లబ్ధిదారులు, అటవీ హక్కుల చట్టం-2006 లబ్ధిదారులు, చిన్న, సన్న కారు రైతులంతా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది. అర్హులు దరఖాస్తు, ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, స్థలం హక్కు పత్రం, బ్యాంకు పాస్ పుస్తకం తదితరాలను జత చేసి సంబంధిత ఎంపీడీఓలకు అందజేయాలి. పశువైద్యులు గ్రామానికి వచ్చి రైతుకు పశువులు ఉన్నాయా లేదా అని పరిశీలిస్తారు. ఉపాధి హామీ ఏపీఓలు షెడ్డు నిర్మాణానికి అనువైన స్థలం, రైతు అర్హతలను పరిశీలించి ఆన్‌లైన్ చేస్తారు. అనంతరం రైతులకు షెడ్లు నిర్మిస్తారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం దరఖాస్తు ఆన్‌లైన్ చేశాక కూటమి నేతలు ఆమోదముద్ర వేస్తేనే పథకం మంజూరైన పరిస్థితి నెలకొంది.

అర్హత కలిగిన వారందరికీ షెడ్లు..

జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి 1,470 గోకులం షెడ్లు మంజూరు చేసి లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేశాం. నిర్మించే బాధ్యతను ఉపాధి హామీ పథకం అధికారులకు ప్రభుత్వం అప్పగించింది. ఈ ప్రక్రియ జిల్లాలో వేగవంతమైంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా మరో వెయ్యికి పైగా షెడ్లకు అనుమతులిస్తాం. అర్హత కలిగిన రైతులకు న్యాయం చేస్తాం. లబ్ధిదారుల ఎంపికలో సిఫార్సులకు తావివ్వలేదు. కలెక్టర్ ఆదేశాల మేరకు చిన్న, సన్న కారు రైతు అయి ఉండి, ఉపాధి జాబ్‌కార్డు, బ్యాంకు ఖాతా, తెల్ల రేషన్ కార్డు, ఐదెకరాల్లోపు సొంత పొలం ఉండి పశువులు, మేకలు, గొర్రెలు, పౌల్ట్రీ ఉన్న రైతులను మాత్రమే అర్హులుగా ఎంపిక చేశాం.

– జీపీ వెంకటస్వామి, జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ

'తమ్ముళ్ల' బరి తెగింపు

- రూ. కోటి విలువ చేసే ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం
- రాత్రికి రాత్రే జేసీబీలతో చదును చేయించిన వైనం



టీడీపీ నేతలు చదును చేసిన ఉరవకొండలోని ప్రభుత్వ స్థలం

ఉరవకొండ: ప్రభుత్వ, ఆలయ భూములపై పచ్చ నేతలు కన్నేస్తున్నారు. 'మా పార్టీ అధికారంలోకి ఉంది. ఇక అడ్డే లేదు' అన్నట్లుగా భూములపై వాలిపోతున్నారు. ఉరవకొండ పట్టణంలో జాతీయ రహదారి సమీపంలో ఉన్న శివరామిరెడ్డి కాలనీలో రూ. కోటి విలువ చేసే స్థలాన్ని కబ్జా చేసేందుకు టీడీపీ నేతలు సిద్ధమయ్యారు. రెండు రోజుల క్రితం రాత్రికి రాత్రే జేసీబీలు పెట్టి చదును చేయించారు. 2003 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక వైపు రాయచోటి వీరభద్రస్వామి ఆలయ భూమిని కొనుగోలు చేసింది. పేదలకు పట్టాలందించగా.. ఇళ్లు నిర్మించుకుని శివరామిరెడ్డి కాలనీగా నామకరణం చేసుకున్నారు. ఇంకా మిగిలిన భూమిలో అంబేడ్కర్ గురుకుల పాఠశాల, ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములు నిర్మించారు. 3 ఎకరాలను ప్రభుత్వ ఐటీఐ కళాశాల, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాల నిర్మాణానికి కేటాయించగా.. మరో 50 సెంట్ల స్థలం మిగిలి ఉంది. దీనిపై కన్నేసిన టీడీపీ నేతలు ఇటీవల రాత్రికి రాత్రే జేసీబీలతో చదును చేసి హద్దులు వేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఉరవకొండ పట్టణానికి చెందిన ఓ ప్రయివేట్ సర్వేయర్ కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. గతంలో ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ అవతారమెత్తి అన్నీ తానై నడిపిన అతను ఎన్నో అక్రమాల్లో పాలుపంచుకున్నారు. దీనిపై తహసీల్దార్ మహబూబ్‌బాషా వివరణ కోరగా.. ఆ 50 సెంట్ల స్థలం దాదాపు రూ. కోటి విలువ చేస్తుందన్నారు. స్థలంలో కొందరు జేసీబీలతో చదును చేసినట్లు తెలిసిందన్నారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

ఖాకీ క్రౌర్యం

- ప్రతిపక్ష నాయకులే లక్ష్యంగా రెచ్చిపోతున్న పెద్దపప్పూరు ఎస్‌ఐ
- ఓ కేసు విషయంలో గౌస్‌మహమ్మద్ అత్యుత్సాహం
- నిందితుల బంధువులు, గ్రామస్తులను వేధిస్తున్న వైనం



పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్

సాక్షి టాస్క్‌ఫోర్స్: ప్రజల రక్షణ పోలీసుల బాధ్యత. ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరించడం వారి కర్తవ్యం. కానీ, అవన్నీ మరచిపోయి ఓ ఎస్‌ఐ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నేతల మెప్పు పొందేందుకు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వివరాలు.. టీడీపీ నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి స్వగ్రామమైన పెద్దపప్పూరు మండలం జూటూరులో 2022 సెప్టెంబర్ 17న రహదారి విషయమై ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. ఇందులో దాదాపు 26 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. జేసీ అనుచరులు కొందరు జైలుకు వెళ్లి వచ్చారు. ఇదే కేసులో జేసీ కుటుంబాన్ని వ్యతిరేకించే రామ్మోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, వినయ్ కుమార్‌రెడ్డి, పెద్దిరెడ్డిలు ఇటీవల బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానిక టీడీపీ నాయకులు బెదిరింపులు ఎక్కువ కావడంతో భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ క్రమంలోనే జేసీ కుటుంబం మెప్పు పొందేందుకు ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ రంగంలోకి దిగారు. నిత్యం జూటూరు గ్రామంలోకి వెళ్లి అలజడి సృష్టిస్తున్నారు. జేసీ కుటుంబాన్ని వ్యతిరేకించే వారి బంధువులపై దౌర్జన్యం చేస్తున్నారు. వారం రోజులుగా రామ్మోహన్‌రెడ్డి అల్లుడు భరత్‌రెడ్డి, ఆయన తండ్రి శ్రీనివాసరెడ్డిని స్టేషన్‌కు రప్పించి రాత్రి వరకు అక్కడే ఉంచుకుంటూ వేధింపులకు గురిచేస్తున్నారు. అలాగే రామ్మోహన్‌రెడ్డి సోదరుడు రవికుమార్‌రెడ్డిని కూడా స్టేషన్‌కు రప్పించుకొని వారు ఎక్కడ ఉన్నారో చెప్పాలంటూ వేధిస్తున్నారు. దీంతో పాటు కేసులో సాక్షులైన గ్రామస్తుల దగ్గరికి వెళ్లి 'మీకు ఎవరురా దిక్కు.. మీ నాయకులకే గతిలేదు.. మీకెందుకు రా గొడవలు' అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలిసింది. అధికార పార్టీ నేత మెప్పు పొందేందుకు ఎస్‌ఐ అత్యుత్సాహం ప్రదర్శిస్తుండటంతో గ్రామస్తులు విసిగిపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మహమ్మద్ గౌస్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంపనూరు.. భక్త జనహోరు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు గ్రామంలోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేల సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో సర్పదోష, కాల సర్పదోష నివారణకు సర్పభూషణ రుద్ర సహిత సర్ప శాంతి హవనం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పంచామృతాభిషేకాలతో పాటు విశేష పూజలు చేసి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు చేసి మహా మంగళహారతి అందించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ సిబ్బంది భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు.



ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కొనసాగుతున్న గోప్యత

- ప్రభుత్వ ఉద్యోగిని హత్యను ధ్రువీకరించని పోలీసులు
- గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు
- లభ్యమైన స్థలంలోనే పోస్ట్‌మార్టం
- అక్కడ లభించిన చీర, బ్యాగు తమ తల్లివేనన్న కుమారుడు, కుమార్తె!



మృతదేహం లభించిన ప్రాంతం

రాప్తాడురూరల్: సంచలనం సృష్టించిన ప్రభుత్వ ఉద్యోగిని గొల్ల రామాంజనమ్మ అదృశ్యంపై సస్పెన్స్ కొనసాగుతోంది. పశుసంవర్ధకశాఖలో అటెండర్‌గా పని చేస్తున్న రామాంజనమ్మ గత నెల 17న అదృశ్యమయ్యారు. దీనిపై రూరల్ పీఎస్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. నగర శివారులోని బళ్లారిరోడ్డు ఎంవైఆర్ ఫంక్షన్ హాలు ఎదురుగా కాలనీలో నివాసం ఉంటున్న రామాంజనమ్మను కొందరు దారుణంగా హత్య చేసినట్లు తెలుస్తోంది. ఆమె ఇంటి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇంటికి వాచ్‌మన్‌గా ఉన్న వ్యక్తి కుమారుడు, మరో ఇద్దరితో కలిసి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది. మృతదేహాన్ని ఆమె ఇంటి సమీపంలో పడేసి చెత్త కప్పినట్లు సమాచారం. ఇటీవల నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నిందితుల గత నేరచరిత్ర, వీరి కదలికలపై కన్నేసిన పోలీసులు కూపీ లాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

గుర్తు తెలియని మృతదేహంగా కేసు..

అయితే ఈ విషయం బయటకు పొక్కకుండా పోలీసులు అత్యంత గోప్యత పాటించడం వెనుక అనుమానాలు కలుగుతున్నాయి. సంఘటనాస్థలంలో ఏఆర్ పోలీసులను గస్తీ పెట్టడం చూస్తుంటే విచారణ అత్యంత రహస్యంగా చేపడుతున్నట్లు అర్థమవుతోంది. దీనిపై ఆదివారం పత్రికల్లో కథనాలు రావడంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మృతదేహానికి మధ్యాహ్నం పోస్ట్‌మార్టం నిర్వహించారు. మృతురాలి చీర, బ్యాగు, దుప్పటి తమ తల్లివేనని రామాంజనమ్మ కుమారుడు, కుమార్తె నిర్ధారించినట్లు తెలిసింది. ఆమె అల్లుడు, మరిది, తమ్ముడు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసినట్లు సమాచారం. గుర్తు పట్టడానికి ఏమాత్రం అవకాశం లేకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగానే పోలీసులు కేసు నమోదు చేశారు.

ఒంటరి మహిళ కావడంతో టార్గెట్?

గొల్ల రామాంజనమ్మ భర్త సోమయ్య పోలీసుశాఖలో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా పని చేస్తుండేవారు. ఆయన గుండెపోటుతో మృతి చెందడంతో కారుణ్య నియామకం కింద భార్యకు పశు సంవర్ధకశాఖలో అటెండర్‌గా ఉద్యోగం కల్పించారు. ఈమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం కాగా ఒక కుమారుడు గతంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మరో కుమారుడు ప్రైవేట్ వాహన డ్రైవరుగా పని చేస్తున్నాడు. సమస్యల కారణంగా ఈయన భార్య వదిలేసి పుట్టింటికి వెళ్లింది. కుమార్తెకు వివాహమైంది. ఇంట్లో తల్లీకుమారుడు మాత్రమే ఉంటారు. కుమారుడు వాహనానికి వెళ్తే 10-15 రోజులైనా ఇంటికొచ్చేవాడు కాదు. తల్లి ఒక్కటే ఇంట్లో ఉండేది. శివారు ప్రాంతం కావడం, ఒంటరి మహిళగా ఉండడంతో నగదు, బంగారు ఆభరణాల కోసం ఆశపడి ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటారనే ప్రచారం సాగుతోంది. ఏది ఏమైనా ఈ కేసులో పోలీసుల దర్యాప్తు పూర్తయితే నిందితుల వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

చలికాలం.. దూరం దూరం

- ఇప్పటికీ అధికంగా పగటి ఉష్ణోగ్రతలు
- నెలాఖరు వరకూ ఇదే వాతావరణం!
- గతంలో కార్తీక మాసం మొదలయ్యేసరికే వణికించే చలి



సాక్షి ప్రతినిధి, అనంతపురం: గతంలో కార్తీక మాసం వచ్చిందంటే చలి గడగడలాడించేది. అక్టోబర్ చివరి వారం నుంచే వాతావరణం పూర్తిగా మారిపోయేది. ఉదయం పూట చన్నీళ్ల స్నానం చేయాలంటే వణికిపోయే పరిస్థితి ఉండేది. కానీ, ఇటీవల వాతావరణంలో మార్పుల కారణంగా భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. నవంబర్ రెండో వారం మొదలైనా ఉష్ణోగ్రతలు ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. గతంలో మాదిరి రాత్రి దట్టంగా మంచుకురిసి ఉదయం 9 వరకూ గజగజ వణికే పరిస్థితులు లేవు. ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు ప్రభావం చూపుతున్నాడు. నవంబర్‌లో చలి లేదేంటబ్బా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఉక్కపోతే..

ఇప్పటికీ పగటి పూట ఉష్ణోగ్రతలు తగ్గలేదు. పగలు కనిష్టంగా 32 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో సెమీ సమ్మర్ లాగా చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఇప్పటికీ రాత్రిళ్లు ఏసీల వినియోగం ఆగలేదు. పగటి పూట వేడిగాలులు వీస్తుండటంతో తట్టుకోలేక 50 శాతం మంది ఏసీల వినియోగం కొనసాగిస్తున్నట్టు విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఇక ఫ్యాన్లు అయితే 24 గంటలూ తిరగాల్సి వస్తోంది. విద్యుత్ వినియోగంలో స్వల్ప మార్పులు మాత్రమే కనిపిస్తున్నాయని, ఉష్ణోగ్రతలే ఇందుకు కారణమని చెబుతున్నారు.

ఉపరితల ఆవర్తనాలతోనే..

సీజన్లు సమయానికి రావడం, పోవడం అనేది ఇటీవల ఆటుపోట్లతో కూడుకుని ఉన్నదని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో మంచి వర్షం కురిసింది. ఆ తర్వాత అక్టోబర్‌లో మాత్రమే పడింది. వాతావరణంలో మార్పులు, సముద్ర ఉపరితల ఆవర్తనాలతో వర్షాలు పడటంలోనూ, సీజన్లు సమయానికి రాకపోవడంపైనా ప్రభావం చూపుతున్నాయి. వచ్చే ఏడాది కూడా ఎండలు మండే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నట్టు తెలుస్తోంది. ఈ నెలాఖరు వరకూ ఇదే వాతావరణం కొనసాగవచ్చని సమాచారం.

ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వల్లే..

సాధారణ ఉష్ణోగ్రతలతో పోల్చితే ప్రస్తుతం ఉష్ణోగ్రతల మధ్య తేడా ఒక డిగ్రీ సెంటి గ్రేడ్‌గా నమోదవుతోంది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం, గ్లోబల్ వార్మింగ్ తదితర కారణాలతో మార్పులు ఎక్కువగా సంభవిస్తున్నాయి. గత ఏడాది ఉష్ణోగ్రతల తగ్గుదల నవంబర్ రెండో వారంలో గమనించాం. రాబోయే వారం రోజుల్లో ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంది.

– విజయ్ శంకర్ బాబు, ప్రధాన శాస్త్రవేత్త, రేకులకుంట వాతావరణ కేంద్రం

క్లుప్తంగా

నేత్రదానం



కళ్లను దానం చేస్తున్న నరసింహులు కుటుంబ సభ్యులు

అనంతపురం మెడికల్: మరణించిన తర్వాత ఇతరులకు కంటి చూపు ప్రసాదించారు కనగానిపల్లి మండలం గుంతపల్లికి చెందిన నరసింహులు (65). ఈ నెల 9న నగరంలో ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం సర్వజనాస్పత్రిలోని మార్చురీ వద్ద కుటుంబ సభ్యులు నరసింహుల కళ్లను ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి అందించారు. భార్య భారతి, కుమారుడు సతీష్, సర్పంచ్ మల్లేష్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పోలీసులకు పట్టుబడిన పేకాట రాయుళ్లు

చెన్నేకొత్తపల్లి: పేకాట ఆడుతున్న ఆరుగురిని ఆదివారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామ పరిసరాల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.15,200, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఫర్టిలైజర్ షాపులో చోరీ



ఫర్టిలైజర్ షాపులో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

ఉరవకొండ: స్థానిక మహదేవ్ ఫెర్టిలైజర్ షాపులో దొంగతనం జరిగింది. పోలీసులు, షాపు నిర్వాహకుడి వివరాలమేరకు... బాలాజీ థియేటర్ సమీపంలో ఉన్న ఫర్టిలైజర్ షాపులో ఆదివారం తెల్లవారుజామున దొంగలు షట్టర్ తాళాలు పగలగొట్టి షాపులోనికి ప్రవేశించారు. క్యాష్‌బ్యాగ్‌లో భద్రపరిచిన రూ.90 వేల నగదును ఎత్తుకెళ్లారు. దొంగతనం దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. షాపు నిర్వాహకుడు రాము ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.క్లూస్ టీఎం ఘటనా స్థలాన్ని పరిశీలించింది.

ఒక గ్రామం.. రెండు జిల్లాలు!



ఇక్కడ కనిపిస్తున్న ఈ ఇల్లు సూర్యనారాయణకు చెందినది. ఇంటి లోపలి భాగం నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం రంగాపురానికి చెందినది కాగా ఇంటి బయట ఉన్న బాత్రూమ్ మాత్రం అనంతపురం జిల్లా యాడికి మండలం దైవాలమడుగు గ్రామంలోకి వస్తోంది.

ఆ గ్రామం.. చూసేందుకు ఒక్కటే అనిపిస్తుంది. కానీ రెండు పంచాయతీలు. రెండు మండలాలు.. ఆఖరికి జిల్లాలు కూడా వేర్వేరే. తక్కువ జనాభా ఉన్నా రెండు రేషన్ దుకాణాలు, అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. ఏ ఎన్నికలు వచ్చినా ఎవరి నియోజకవర్గాల్లో వారు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.



రెండు జిల్లాలను కలుపుతున్న రాయలచెరువు - డోన్ రోడ్డు

- రోడ్డుకు ఒక వైపు అనంతపురం.. మరోవైపు నంద్యాల జిల్లా
- అంగన్‌వాడీ మొదలు రేషన్ షాపు దాకా అన్నీ రెండే
- ఓటు వేసేది కూడా వేర్వేరు నియోజకవర్గాల్లోనే..
- సమస్యలున్నా పట్టించుకోవడంలేదని స్థానికుల ఆవేదన

యాడికి: అనంతపురం జిల్లాకు చివరి గ్రామమైన దైవాలమడుగులో వింత పరిస్థితి నెలకొంది. గ్రామంలో 160 కుటుంబాలు ఉన్నాయి. 408 ఓట్లు ఉన్నాయి. రాయలచెరువు - డోన్ రహదారిలోని బ్రహ్మంగుడి కాలనీలో 30 కుటుంబాలలో 20 కుటుంబాలు నివసిస్తున్న భాగం అనంతపురం జిల్లా యాడికి మండలం సి.లక్షుంపల్లె గ్రామ పంచాయతీలోకి వస్తోంది. అలాగే మరో 10 కుటుంబాలు ఉన్న భాగం నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం జక్కసానికుంట్ల పంచాయతీ పరిధిలో ఉంది. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆ 30 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను అప్పటి ఉమ్మడి కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం జక్కసానికుంట్ల పంచాయతీ నుంచి మంజూరు చేసి నిర్మించారు. 2009 ఎన్నికలకు ముందు నియోజకవర్గాల పునర్విభజన సమయంలో కూడా ఈ గ్రామాన్ని యథాతథంగా కొనసాగించడం గమనార్హం.

ప్రధాన రహదారే సరిహద్దు ..

దైవాలమడుగు గ్రామంలో ప్రధాన రహదారి రెండు జిల్లాల సరిహద్దు రేఖగా మారింది. రోడ్డుకు ఒక వైపు ఉన్న భూభాగం అనంతపురం జిల్లాలోకి, మరోవైపు ఉన్న భాగం నంద్యాల జిల్లా పరిధిలో ఉన్నట్లు పరిగణిస్తూ గత పాలకులు నిర్ణయించారు. ఈ గ్రామంలో ఏదైనా సరే రెండు చొప్పున ఏర్పాటు చేయాల్సిందే. రేషన్ దుకాణాలు రెండు, అంగన్వాడీ కేంద్రాలు రెండు ఉండటం విశేషం. రంగాపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాల లేక పోవడంతో ఆ గ్రామం నుంచి కొంత మంది తమ పిల్లలను దైవాలమడుగులోని ప్రాథమిక పాఠశాలకు పంపుతున్నారు. అధికారులు, కొత్త వ్యక్తులు తికమక పడకుండా ఉండేందుకు కర్నూలు జిల్లా పరిధిలో ఉన్న భాగాన్ని బ్రహ్మం గుడి కాలనీ అని పిలుస్తారు. అనంతపురం జిల్లా పరిధిలో దైవాలమడుగు గ్రామంలో 408 ఓట్లు ఉన్నాయి. రోడ్డు సమీపంలో 20 కుటుంబాలలోని 40 ఓట్లు అనంతపురం జిల్లాలో ఉన్నాయి. కానీ వీరు నివసిస్తున్న ఇంటికి ప్యాపిలి మండలం నుంచి కరెంటు ఉండటంతో కరెంటు బిల్లును ప్యాపిలి మండలం విద్యుత్ అధికారులకు చెల్లిస్తున్నారు. అవతలి వైపున ఉన్న 10 కుటుంబాలలో దాదాపు 30 మంది ఎన్నికల సమయంలో తమ ఓటు హక్కును నంద్యాల జిల్లాకు వినియోగించుకున్నారు. ప్రస్తుతం రోడ్డు సమీపంలో ఏదైనా ఉత్సవాలు జరిగినప్పుడు అందరూ కలిసే చేసుకుంటారు. ఇక్కడున్న వారందరికీ వ్యవసాయమే జీవనాధారం.

ఇళ్లు ఇక్కడ.. కరెంటు బిల్లు కట్టేది అక్కడ

ఎనిమిదేళ్ల క్రితం బ్రహ్మంగుడి సమీపంలో ఓ విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బతుకుదెరువు కోసం బాలిక తల్లి దుబాయ్‌కి వెళ్లింది. ఆ బాలిక అన్న లారీడ్రైవర్ కావడంతో డ్యూటీకి వెళ్లాడు. రేషన్ కార్డు, ఓట్లన్నీ నంద్యాల జిల్లా రంగాపురం (బ్రహ్మంగుడి కాలనీకి 12 మీటర్ల దూరంలోని) గ్రామానికి చెందే విధంగా ఉన్నాయి. కానీ ఆ కుటుంబం నివసిస్తున్న ఇల్లు మాత్రం అనంతపురం రెవెన్యూ డివిజన్‌లోకి ఉండటంతో డోన్ నియోజకవర్గం జలదుర్గం ఎస్‌ఐ వచ్చి ఈ బాలిక నివసిస్తున్న ఇల్లు నంద్యాల జిల్లాలోని రెవెన్యూ పరిధిలోకి రాదని చెప్పి కేసు నమోదు చేయకుండా వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న అనంతపురం జిల్లా యాడికి మండలం అప్పటి ఎస్‌ఐ కత్తి శ్రీనివాసులు బాలిక మృతదేహాన్ని కిందికి దింపి కేసు నమోదు చేసుకొని దహన సంస్కారాలు చేయించారు. ఆనాటి నుంచి అక్కడ నివసిస్తున్న 20 కుటుంబాలకు చెందిన వారు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఓట్లన్నీ అనంతపురం జిల్లాకు మార్చుకున్నారు. వీరిలో ప్రస్తుతం 8 మందికి వృద్ధాప్య పింఛన్లు కూడా వస్తున్నాయి. కానీ వారు నివసిస్తున్న ఇంటికి మాత్రం నంద్యాల జిల్లా నుంచి వచ్చే స్తంభాల ద్వారా కరెంట్‌ను వినియోగిస్తుండటంతో కరెంట్ బిల్లు, ఇంటి పన్నును నంద్యాల జిల్లాకు కడుతున్నారు. గత ఎన్నికల సమయంలో ఓట్లను అనంతపురం జిల్లాకు మార్చుకోవడంతో బ్రహ్మం గుడి కాలనీలో ఉన్న నీటి ట్యాంకును కర్నూల్ జిల్లాలోని రంగాపురానికి తరలించారు. దీంతో 20 కుటుంబాలకు చెందిన వారు రూ.60 వేల సొంత ఖర్చులతో నీటి ట్యాంకును ఏర్పాటు చేసుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మా ఇల్లు నిర్మించినప్పటి నుంచి ప్యాపిలి మండలం నుంచి వచ్చే విద్యుత్‌ను వాడుతున్నాం. కరెంటు బిల్లు కూడా వారికే కడుతున్నాం. ప్రస్తుతం మా కాలనీలో చాలా మంది ఆధార్, రేషన్ కార్డులను అనంతపురం జిల్లాకు మార్చుకున్నాం. మేము కరెంట్ బిల్లు కడతామన్నా లక్షుంపల్లె గ్రామ పంచాయతీ అధికారులు రసీదులు ఇవ్వటం లేదు. మా ఇండ్లకు కొలతలు వేసి ఇంటి పన్ను కట్టించుకోవాలి, కొత్తగా కరెంట్‌ను మా ఇండ్లకు సప్లయ్ చేసి కరెంట్ బిల్లును కట్టించుకొని మాకు సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఉల్లిందల దస్తగిరి, బ్రహ్మంగుడి పూజారి

30 ఏళ్లుగా డీ పట్టా ఇవ్వలేదు



బ్రహ్మంగుడి సమీపంలో మా పూర్వీకుల కాలం నుంచి నివసిస్తున్నాము. 2004లో మాకు ప్యాపిలి మండలం నుంచి ఇందిరమ్మ ఇళ్లను అప్పటి అధికారులు నిర్మించడంతో ఆధార్, రేషన్‌కార్డు, ఓట్లు, ఇంటి, కరెంటు పన్నులు అన్నీ ప్యాపిలి మండలం రంగాపురం గ్రామం పేరున ఉన్నాయి. రంగాపురంలో ప్రాథమిక పాఠశాల లేకపోవడంతో యాడికి మండలం దైవాలమడుగు ప్రాథమిక పాఠశాలలో చదివిస్తున్నాను. కానీ చందన రెవెన్యూ పొలంలో మాకున్న 1.80 ఎకరాల పక్కనే ఉన్న 3 ఎకరాల ప్రభుత్వ భూమిని గత 30 ఏళ్లుగా సాగులో ఉన్నాను. గత ఏడాది జరిగిన భూ పంపిణీలో నేను నంద్యాల జిల్లా వాసిని అని యాడికి రెవెన్యూ అధికారులు నాకు డీ పట్టా ఇవ్వలేదు. ఈ విషయం ప్యాపిలి తహసీల్దార్‌ను అడిగితే మీరు సాగు చేసిన భూమి ప్యాపిలి మండలంలో లేదని చెప్పారు. ఏమి చేయాలో అర్థం కాలేదు.

– రంగనాథ్, బ్రహ్మంగుడి కాలనీ

రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక పాలన



మాట్లాడుతున్న ఏఐయూటీయూ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు సోమశేఖర్

అనంతపురం అర్బన్: రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక పాలన సాగుతోందని ఏఐటీయూసీ అఖిల భారత కార్యదర్శి వర్గ సభ్యుడు సోమశేఖర్ యాదగిరి విమర్శించారు. దీర్ఘకాలిక ఉద్యమ నిర్మాణమే సమస్యలకు పరిష్కార మార్గమన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో ఆల్ ఇండియా యునైటెడ్ ట్రేడ్ యూనియన్ సెంటర్ (ఏఐయూటీయూసీ) రాష్ట్ర మహాసభను నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి కె.సుధీర్ అధ్యక్షతన జరిగిన సభకు సోమశేఖర్ ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. గ్లోబలీకరణ, ప్రైవేటీకరణ విధానాలను రాష్ట్రంలోనూ అమలు చేస్తుండడంతో లక్షలాది మంది కార్మికులు, రైతులు జీవనోపాధి కోల్పోతున్నారని, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారన్నారు. చాలామంది ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న 44 చట్టాలను కాలరాసి, కార్పొరేట్‌కు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టిందన్నారు. ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజలు పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు డి.రాఘవేంద్ర మాట్లాడారు.

రాష్ట్ర నూతన కమిటీ ఏర్పాటు..

రాష్ట్ర మహాసభ అనంతరం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.సుధీర్, కార్యదర్శిగా అశోక్, ఉపాధ్యక్షులుగా సి.హెచ్.ప్రమీల, నాగన్న, బసవరాజును ఎన్నుకున్నారు. కోశాధికారిగా సి.ఎల్.రామకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులుగా కిషోర్, శేఖర్‌తో పాటు 15 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

అనంతపురం అర్బన్: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలంటూ 104 మొబైల్ మెడికల్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆదివారం కలెక్టరేట్ వద్ద ధర్నాతో పాటు వంటావార్పు నిర్వహించారు. 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ధర్నాకు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నాగమణి, నాగేంద్రకుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. అన్నివేళల అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్యసేవలందిస్తున్న 104 ఉద్యోగుల విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఎంఎంయూ జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం మాట్లాడుతూ తమకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కంటే తక్కువ వేతనం ఇస్తున్నారని, జీఓ 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రామాంజినేయులు, 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు సింహ తదితరులు పాల్గొన్నారు.

డీటీ ఆంజనేయులు బదిలీ

అనంతపురం అర్బన్: కలెక్టరేట్ పరిపాలన విభాగంలో ఏ–1 డీటీగా విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులును కళ్యాణదుర్గం ఆర్‌డీఓ కార్యాలయం డీటీగా బదిలీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంజనేయులుకు పరిపాలన విభాగం వ్యవహారాల్లో విశేష అనుభవం, విధుల్లో నిబద్ధత ఉండడంతో దాదాపు ఏడేళ్లు ఆయన సేవలను వినియోగించుకున్నారు. అయితే ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నానని, తనను కలెక్టరేట్ నుంచి బదిలీ చేయాలంటూ ఆయన చేసుకున్న అభ్యర్థనను కలెక్టర్ పరిగణలోకి తీసుకుని కళ్యాణదుర్గం బదిలీ చేస్తూ ఆర్డీఓ కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల విజేతగా ‘అనంత’



విజేతగా నిలిచిన అనంతపురం జిల్లా బాలికల జట్టు

సత్తెనపల్లి: రాష్ట్రస్థాయి అండర్ –19 ఫుట్‌బాల్ పోటీల్లో బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గుంటూరు, ప్రగతి జూనియర్ కళాశాల సత్తెనపల్లి ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్–19 ఫుట్‌బాల్ పోటీలు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మూడు రోజుల పాటు నిర్వహించారు. ఆదివారం ఫైనల్ పోటీలు జరిగాయి. బాలికల విభాగంలో ఫైనల్స్‌లో వైఎస్సార్ కడప జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. విజేతకు ట్రోఫీతో పాటు రోలింగ్ షీల్డ్, నగదు బహుమతులను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అందజేశారు.

తైక్వాండో పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

అనంతపురం: తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో అనంతపురం జిల్లా తైక్వాండో జట్టును ఎంపిక చేశారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకూ ప్రకాశం జిల్లా కందుకూరులో జరిగే 38వ అంతర జిల్లాల తైక్వాండో పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, వైస్ చైర్మెన్ కుళ్లాయిస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శి శాంతరాజు, సీనియర్ కోచ్‌లు కేశవ, వెంకట్, మణీంద్ర, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలుర జట్టు వివరాలు..

వి.శృతిక్, ఎస్. శ్రీకర్, ఎస్. జస్విన్‌సాయి, బి.జశ్వంత్, యు.రిత్విక్, ఎస్. విరంచి, ఎస్.షాబీర్, కే.దర్శిత్, ఎస్. ఈశ్వర్, ఎల్.హర్షవర్ధన్‌రెడ్డి, వై.ప్రణీత్‌రెడ్డి టీ.భవేష్



ఎంపికైన క్రీడాకారులు

బాలికల జట్టు..

టి.ప్రవర్తి, డి. పూజ, యు.సింధు, జి. చైతన్య , వై.ప్రణవి శ్రీ, ఎస్. హేమశ్రీ, ఎం. ధనవర్ధిని, బి.సాయి తన్వి, ఎస్.సాయి సంకల్ప, ఎస్.వైష్ణవి

హాకీ చాంపియన్ ఆర్ట్స్ కళాశాల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ అంతర కళాశాలల గ్రూప్–సీ పోటీల్లో భాగంగా ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన హాకీ పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విజేతగా నిలిచింది. ఆదివారం ఆర్ట్స్ కళాశాల, ధర్మవరం ప్రభుత్వ కళాశాల క్రీడాకారుల మధ్య పోటీ జరిగింది. ఆర్ట్స్ కళాశాల 6, ధర్మవరం కళాశాల 3 గోల్స్ చేసింది. దీంతో ఆర్ట్స్ కళాశాల జట్టు జయకేతనం ఎగరేసింది. విజేత జట్టుకు ఎస్కేయూ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బి. జెస్సీ బహుమతులు అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్ ఏ. శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

గుమ్మఘట్ట: మండలంలోని సిరిగెదొడ్డి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో భూతయ్య (60) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు సిరిగెదొడ్డికి చెందిన భూతయ్య ఇంటి వద్దనే ఉండేవాడు. ఇద్దరు భార్యలు పదేళ్ల క్రితం మరణించారు. కుమారుడు కర్ణాటకలోని మైలుపల్లిలో నివాసం ఉంటున్నాడు. దీంతో సోదరి రాధమ్మ ఇంటిలో భూతయ్య నివాసం ఉండేవాడు. ఆదివారం గ్రామంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా వెనుక వైపు నుంచి ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో భూతయ్యకు తీవ్రగాయాలయ్యాయి. రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించి అక్కడి వైద్యుల సూచన మేరకు అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. అయితే ఈ కేసును పక్కదారి పట్టించేందుకు పోలీసులు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

డీ హీరేహాళ్ (రాయదుర్గం): డీ హీరేహాళ్ మండలం పూలకుర్తికి చెందిన నాగరత్నమ్మ (28) అనే వివాహిత ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా రజాపురంకు చెందిన నాగరత్నమ్మకు పూలకుర్తి శ్రీరాములుతో ఆరేళ్ల కిత్రం వివాహమైంది. అత్త రేణుకమ్మ, మరిది గవిసిద్ధ తరచూ వేధించేవారు. కూలి డబ్బులు నిత్యం తమకే ఇవ్వాలనేవారు. తరచూ గొడవలు జరిగేవి. శనివారం రాత్రి కూడా ఇంట్లో ముగ్గురు గొడవ పడ్డారు. మనస్తాపం చెందిన నాగరత్నమ్మ ఇంట్లోనే ఉరివేసుకుంది. మృతురాలి తండ్రి తిప్పయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు..



ఇంద్రతేజ (ఫైల్)

వజ్రకరూరు: మండలంలోని పొట్టిపాడు గ్రామానికి చెందిన ఇంద్రతేజ (17) పురుగుల మందు తాగి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. వజ్రకరూరు పోలీసుల వివరాలమేరకు.. పొట్టిపాడుకు చెందిన నరసింహులుకు కుమారుడు (ఇంద్రతేజ), కుమార్తె ఉన్నట్లు తెలిపారు. అనంతపురంలోని ప్రైవేటు కళాశాలలో ఇంద్రతేజ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు పేర్కొన్నారు. ఇంద్రతేజ మూడేళ్లుగా సెల్‌ఫోన్‌కు అడిక్ట్ కావడంతో పాటు మానసికస్థితి సరిగా ఉండేదికాదన్నారు. తలనొప్పితో కూడా బాధపడేవాడని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంద్రతేజ పురుగు మందు తాగాడన్నారు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు తెలియజేసినట్లు వివరించారు. తండ్రి నరసింహులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఎస్ఎస్‌బీఎన్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



యాడికి: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్ఎస్‌బీఎన్ ఉన్నత పాఠశాలలో 2007–08 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, ప్రస్తుత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. చివరిగా విద్యార్థుల ఆత్మీయ పలకరింపులు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందంగా గడిపారు.

43 ఏళ్ల తర్వాత ..

యాడికి: ఉన్నత స్థానాలకు చేర్చిన పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో 1980–81 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా సాగింది. వివిధ హోదాల్లో స్థిరపడిన వారందరూ 43 సంవత్సరాల తర్వాత పాఠశాల ఆవరణలో కలుసుకోవడంతో సందడి నెలకొంది. పాఠశాల ఆవరణ మంతా కలియ దిరుగుతూ ఒకరినొకరూ ఆప్యాయంగ పలకరిస్తూ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని మురిసిపోయారు. నాటి ఉపాధ్యాయులైన విజయ భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కేశవరెడ్డి, శేషప్ప, ప్రస్తుత హెచ్ఎం నాగన్నను ఘనంగా సన్మానించారు.

క్లుప్తంగా

కార్తీక ఉత్సవాల బ్యానర్ల ఆవిష్కరణ



బ్యానర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ సిబ్బంది

అనంతపురం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్తంగా కార్తీక ధార్మిక ప్రవచనాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బాబు తెలియజేశారు. ఆదివారం కార్తీక ఉత్సవాల బ్యానర్లు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకం విశిష్టత తెలిపే ప్రవచనాలు, కార్తీక సప్తాహం, కైశిక ద్వాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర శివారు ముసలమ్మకట్ట సమీపంలోని కాశీవిశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో ఉత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు అన్నమలై స్వామి, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు 'కార్తీక' ఏకాదశి వేడుకలు

అనంతపురం కల్చరల్: నగరంలోని రామనగర్‌లో వెలసిన శ్రీరుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో మంగళవారం కార్తీక ఏకాదశి వేడుకలను నిర్వహిస్తున్నట్లు భావసార క్షత్రియ సమాజ్ నిర్వాహకులు ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతి.. అనంతరం శ్రీరుక్మిణీ పాండురంగస్వామి వార్ల నిజపాద దర్శనం ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.

పక్కాగా ఓటరు నమోదు చేపట్టాలి

రాప్తాడు: ఓటరు నమోదు కార్యక్రమం పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ విజయకుమారి సూచించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని 16 పంచాయతీల్లో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణలు చేపట్టారు. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు ఓటు నమోదు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈడీటీ సువర్ణ, ఆర్ఐ కరుణాకర్, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



షేక్ రమీజాన్

అనంతపురం: నగరంలోని ఆరో రోడ్డులో నివాసం ఉంటున్న టీఎస్ ముస్తాక్ భార్య తపాలా షేక్ రమీజాన్ అదృశ్యమైంది. శనివారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో మెడికల్ స్టోర్‌కు వెళ్లొస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తర్వాత తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆదివారం త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్త మందలించడంతో మనస్తాపానికి గురై బయటకు వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శాంతిలాల్ తెలిపారు.

నల్లలమ్మకు ప్రత్యేక పూజలు

రాప్తాడు: బుక్కచెర్లలో వెలసిన నల్లలమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలే కాక ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పేరూరు డ్యాంలోకి నీరు



పేరూరు డ్యాం వైపు పరుగులు పెడుతున్న వర్షపు నీరు

రామగిరి: అప్పర్ పెన్నార్ ప్రాజెక్ట్ (పేరూరు డ్యాం)లోకి వర్షపునీరు చేరుతోంది. వారం కిందట కర్ణాటకలోని జయమంగళి నది పూర్తిస్థాయిలో నిండి పరవళ్లు తొక్కగా, పరిగి చెరువు మరువపారింది. అక్కడి నుంచి రొద్దం చెరువు మీదుగా నాగలమడక చెక్‌డ్యాం పూర్తిగా నిండి నీరు పేరూరు డ్యాం వైపు పరుగులు పెడుతోంది. నాలుగురోజులుగా నాగలమడక చెక్‌డ్యాం నుంచి పెన్నానది వెంబడి వస్తున్న నీరు శనివారం రాత్రి పేరూరు డ్యాంలోకి చేరినట్లు గ్రామస్తులు తెలిపారు.

వెండిహారం వితరణ

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ఆత్మకూరు మండలం ఆలమూరుకు చెందిన పాటిల్ మల్లికార్జున రెడ్డి, రజిత దంపతులు వెండిహారం వితరణ చేసినట్లు ప్రధాన అర్చకుడు రామాచార్యులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్వామికి రూ.11 వేలు విలువ చేసే వెండిహారం(10.5 తులాలు) అందజేశారన్నారు.

అర్బన్ ప్రగతి.. అధోగతి!



- పర్సెంటేజీల మోజులో 'ప్రజాప్రతినిధి' • అభివృద్ధి పనులకు అడుగడుగునా అడ్డు • ఎక్కడికక్కడ స్తంభిస్తున్న పనులు
- రూ.13.80 కోట్ల పనులపై నీలినీడలు • నగర చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో కొత్త సంస్కృతి • విస్తుపోతున్న ప్రజలు

ప్రజాప్రతినిధి వైఖరితో ఆదర్శనగర్‌లో అర్ధంతరంగా ఆగిన కాలువ నిర్మాణం



ఇది నగరంలోని 32వ డివిజన్ ఆదర్శనగర్‌లోని ఓ వీధి. ఇక్కడ రూ.18 లక్షల నగరపాలక సంస్థ సాధారణ నిధులతో డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కాంట్రాక్టర్ ఈ ఏడాది జూలైలోనే పనులు మొదలుపెట్టాడు. 50 మీటర్ల మేర కాలువ నిర్మించాడు. మిగిలిన పనులు ముందుకు సాగకుండా టీడీపీ నాయకులు అడ్డుపడ్డారు. తామే పనులు చేస్తామని, తప్పుకోవాలంటూ కాంట్రాక్టరును బెదిరించారు. దీంతో ఎక్కడిపనులు అక్కడే ఆగిపోయాయి. ఆదర్శనగర్‌లోనే మిగిలిన కాలువ పనులకు కూడా ఇదే తరహాలో బ్రేక్ పడింది.

» నగరంలోని 9వ డివిజన్ భవానీనగర్‌లో రూ.18 లక్షల విలువైన సీసీ రోడ్డు పనులకు బ్రేక్ పడింది. పర్సెంటేజీ అందలేదనే కారణంతో టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధి అడ్డుకున్నట్లు తెలుస్తోంది. ఇలా నగరంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులను అడ్డుకోవడం వల్ల మౌలిక సదుపాయాల లేమితో ప్రజలు అవస్థ పడుతున్నారు.

అనంతపురం కార్పొరేషన్: టీడీపీకి చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి పర్సెంటేజీల కక్కుర్తి వల్ల నగరంలో అభివృద్ధి పడకేసింది. పలు డివిజన్లలో పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా నిధులు పుష్కలంగా అందుబాటులో ఉన్నప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. మురుగు కాలువలు, సీసీరోడ్లు తదితర పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఫలితంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగర పాలక సంస్థ పరిధిలో జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం, ఎన్‌క్యాప్ నిధులు రూ.13.80 కోట్లు అందుబాటులో ఉన్నాయి. వీటితో 87 అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ ఏడాది ఆగస్టులోనే టెండర్లు పూర్తి చేసి.. కాంట్రాక్టర్లతో అగ్రిమెంటు కూడా చేసుకున్నారు. అయినా కాంట్రాక్టర్లు ఒకటి మినహా మిగిలిన పనులేవీ చేపట్టడం లేదు. కొన్ని పనులు ప్రారంభించినప్పటికీ మధ్యలోనే ఆపేశారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి పర్సెంటేజీల కోసం వాటికి మోకాలడ్డుతున్నట్లు విమర్శలు విన్పిస్తున్నాయి. ఎన్‌క్యాప్ పనులు సకాలంలో పూర్తి చేయకపోతే నిధులు వెనక్కు వెళ్లే ప్రమాదముంది.

అవసరమైతే అగ్రిమెంట్ లేకుండానే..

తనకు అవసరమైతే ఎలాంటి అగ్రిమెంట్ లేకుండానే పనులు చేయడానికి సదరు ప్రజాప్రతినిధి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేస్తున్నారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఎన్‌క్యాప్ నిధులు రూ.2.2 కోట్లతో బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. సదరు ప్రజాప్రతినిధి ఇంటికి సమీపంలో బీటీ రోడ్డు ఉండాలన్న ఉద్దేశంతో ఎటువంటి అగ్రిమెంట్ లేకుండానే ఈ పనులకు అనుమతి ఇచ్చారు. ప్రజాప్రతినిధికి అవసరమైన వాటిని త్వరగా చేపట్టడం, మిగిలిన వాటిని పర్సెంటేజీల కోసం అడ్డుకోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. నగర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కొత్త సంస్కృతికి శ్రీకారం చుట్టారని ప్రజలు మండిపడుతున్నారు. అభివృద్ధి చేస్తారని టీడీపీకి అవకాశం ఇస్తే నగరాన్ని అధోగతి పాలు చేస్తున్నారని వాపోతున్నారు.

నగర పాలక సంస్థలో డివిజన్లు	50
సాధారణ, 15వ ఆర్థిక సంఘం, ఎన్‌క్యాప్ నిధులు -	రూ. 13.80 కోట్లు
మొత్తం అభివృద్ధి పనులు	87
ప్రస్తుతం జరుగుతున్న పనుల సంఖ్య (శ్రీనగర్ కాలనీ బీటీ రోడ్డు)	1
ఆగిన పనుల సంఖ్య	86

పనులు మధ్యలోనే ఆపేశారు



ఆదర్శనగర్‌లో కొన్నేళ్లుగా జీవిస్తున్నాం. కాంట్రాక్టర్ మా వీధిలో సగం వరకు కాలువ వేసి ఆపేశారు. ఇదేమిటని ఆరా తీస్తే పనులు చేయబోమని చెబుతున్నారు. ఆశ్చర్యమేసింది! ఇక మేమే కాలువపై బల్లలు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నాం. ఏ ప్రభుత్వం ఉన్నా అభివృద్ధి ఆపడం సరైన పద్ధతి కాదు.

– చంద్రలీల, ఆదర్శనగర్, అనంతపురం

ఘనంగా 'ఎస్వీ' కళాశాల రజతోత్సవం



వేడుకల్లో పాల్గొన్న ముఖ్య అతిథులు, కళాశాల యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల రజతోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బళ్లారి రోడ్డులోని ఎంవీఆర్ కల్యాణ మండపంలో సంబరాలు జరుపుకొన్నారు. ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ ఈ. రమేష్ బాబు, రెక్టార్ డాక్టర్ జి. వెంకటనాయుడు మాట్లాడుతూ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో సమానంగా గురువులను భావించాలన్నారు. విద్యార్థులు ప్రపంచ నైపుణ్యాలపై దృష్టి పెట్టాలన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ సి. సోమశేఖరరెడ్డి మాట్లాడుతూ 1999లో 111 మంది విద్యార్థులతో ప్రారంభమైన కళాశాల నేడు 3 వేలమందికి చేరిందన్నారు. కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి మాట్లాడుతూ అంకిత భావం, కృషి, పట్టుదల, ఓర్పు, సహనంతోనే ఇన్నేళ్ల ప్రయాణం సాధ్యమైందన్నారు. అనంతరం బ్రాంచ్‌ల వారీగా టాపర్స్‌కు చెక్కులు, వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్, మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మధుసూదన రెడ్డి. డాక్టర్ కె.సరిత, సొసైటీ ట్రెజరర్ రామసుబ్బమ్మ, సెక్రటరీ సి.సౌజన్య, హిమబిందు, కె.కొండారెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాసులు, ఏట శ్రీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బతిన్న బీర పంట పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



దెబ్బతిన్న బీర పంటను పరిశీలిస్తున్న అధికారులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లిలో కౌలు రైతులు పి.రాజేంద్ర, ఎ.గంగశేఖర్‌రెడ్డి సాగు చేసి దెబ్బతిన్న బీర పంటను ఆదివారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. 2.5 ఎకరాల్లో రాజేంద్ర, గంగశేఖర్‌రెడ్డి సాగుచేసిన బీర పంటకు ఆశించిన దాని, బూడిద తెగులు నివారణకు పురుగు మందుల కోసం రుద్రంపేట సమీపంలోని ఓ ఫర్టిలైజర్స్ షాపు యజమానిని సంప్రదించారు. షాపు యజమాని ఇచ్చిన ఎక్స్‌ల్లార్, జింగామైన్, క్లిఫ్ కలిపి పిచికారీ చేశారు. తర్వాత రోజు నుంచి బీర పంట మొత్తం ఎండిపోతూ వచ్చింది. ఐదారు రోజుల్లో 80 శాతానికి పైగా ఎండిపోయింది. మందులు ఇచ్చిన దుకాణం యజమాని దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన పరిశీలించి అదిగో ఇదిగో అంటూ రెండురోజులు కాలం గడిపిన తర్వాత చేతులెత్తేశాడు. ఈ క్రమంలో ఆదివారం 'సాక్షి'లో 'నిండా ముంచిన పురుగు మందులు' శీర్షికతో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. ఉద్యాన అధికారి నెట్టికంటయ్య, ఉద్యాన విస్తరణాధికారి రామాంజనేయులు, వ్యవసాయ విస్తరణాధికారి మురళి, గ్రామ ఉద్యాన సహాయకుడు దేవేంద్ర గ్రామానికి చేరుకుని బీర పంటను పరిశీలించారు. బీర తోట మాడిపోయిన విషయాన్ని ధ్రువీకరించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేసి.. రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

వాల్మీకులపై సీఎం చిన్నచూపు

- వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్



మాట్లాడుతున్న గంగాధర్, నాయకులు

అనంతపురం రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు వాల్మీకుల పట్ల చిన్నచూపు వైఖరి ప్రదర్శిస్తున్నారని వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్ మండిపడ్డారు. ఆదివారం నగరంలోని వాల్మీకి కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాల్మీకి ఫెడరేషన్ చైర్‌పర్సన్‌గా కప్పట్రాళ్ల సుశీలమ్మ (బొజ్జమ్మ)ను నియమించడం తగదన్నారు. ఆమె గతంలో స్వయంగా మీడియా ఎదుట తాను వాల్మీకి బోయ కులానికి చెందిన వ్యక్తిని కాదని చెప్పారన్నారు. బోయ కులానికి చెందిన వ్యక్తికి కాకుండా వేరే కులానికి చెందిన వారికి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడం సమంజసమేనా అని ప్రశ్నించారు. వాల్మీకి ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర ప్రజా ప్రతినిధులను సంప్రదించకుండానే కార్పొరేషన్ చైర్మన్‌ను నియమించారని ఆరోపించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పునరాలోచించుకోవాలని కోరారు. వాల్మీకులకు చైర్మన్ పదవి వస్తే అన్ని విధాలా న్యాయం జరుగుతుందన్నారు. అత్యంత వెనుకబడిన తమ కులస్తులను కేవలం ఓటు బ్యాంకుగా చూడటం దుర్మార్గమన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పితేనే తమ పిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవయ్య, నగర అధ్యక్షురాలు మంజుల, ప్రధానకార్యదర్శి ముత్యాలు, నాయకులు పెద్దన్న, రామకృష్ణ, సుధాకర్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాప్తాడు: మండలంలోని బొమ్మేపర్తి, లింగనపల్లి, పుల్లరేవు, యర్రగుంట, గొందిరెడ్డిపల్లి, రామినేపల్లి, హంపాపురం, గొల్లపల్లి, మరూరు, ఎం.కృష్ణాపురం, ఎం.చెర్లోపల్లి, పాలవాయి, ఎం.బండమీదపల్లి, పర్వతదేవరపల్లి, ముక్తాపురం తదితర గ్రామాల భారత్ గ్యాస్ వినియోగదారులకు సోమవారం సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. ఈ నెల 10వ తేదీ వరకు భారత్, హెచ్‌పీ, ఇండేన్ గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు రాప్తాడు పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వంట గ్యాస్ సిలిండర్లను అందజేయనున్నారు. మరింత సమాచారం కోసం 08554-286777 (భారత్ గ్యాస్), 08554 246199 (హాసిని ఇండేన్ పవన్ గ్యాస్), 08554 228789 (హనుమాన్ హెచ్‌పీ గ్యాస్)లో సంప్రదించవచ్చు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- బీఎల్‌ఓలకు ఆర్‌డీఓ కేశవనాయుడు ఆదేశం
- నలుగురు బీఎల్‌ఓలకు షోకాజ్ నోటీసు



ప్రత్యేక క్యాంపును తనిఖీ చేస్తున్న ఆర్‌డీఓ కేశవనాయుడు, చిత్రంలో తహసీల్దారు హరికుమార్

అనంతపురం అర్బన్: ఓటరు జాబితా సవరణ ప్రక్రియ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని బీఎల్‌ఓలను ఆర్‌డీఓ కేశవనాయుడు ఆదేశించారు. ఓటు నమోదు, తొలగింపు, వివరాల మార్పునకు దరఖాస్తులను స్వీకరించేందుకు అనంతపురం అర్బన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక క్యాంపులను తహసీల్దారు హరికుమార్‌తో కలిసి ఆర్‌డీఓ తనిఖీ చేశారు. స్థానిక రాజేంద్ర నగర పాలక ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలు (257, 258, 259, 260) తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాలు 257, 258 బీఎల్‌ఓలు ప్రత్యేక క్యాంపునకు హాజరు కాలేదని, పోలింగ్ కేంద్రాలు 259, 260 బీఎల్‌ఓలు గుర్తింపు కార్డు ధరించలేదనే కారణాలతో షోకాజ్ నోటీసు జారీ చేశారు.

గుర్తింపు కార్డు ఇవ్వలేదు

సచివాలయ ఉద్యోగులకు గుర్తింపు కార్డులను జిల్లా అధికారులు జారీ చేయలేదని తెలిసింది. కొందరు ఉద్యోగులు సొంతంగా గుర్తింపు కార్డు తయారు చేయించుకుని ధరిస్తున్నట్లు సమాచారం. అధికారులు గుర్తింపు కార్డులే ఇవ్వనప్పుడు వాటిని ధరించలేదంటూ ఆర్‌డీఓ షోకాజ్ నోటీసు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ప్రజలపై భారం మోపుతున్న ప్రభుత్వాలు

- ప్రజాపోరులో సీపీఎం నాయకులు



ప్రజాపోరు నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: ప్రజలపై భారం మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని ప్రజలకు సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. సీపీఎం చేపట్టిన ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వాల తీరును నాయకులు ఎండగడుతూ ఆదివారం నగరంలోని శ్రీశ్రీనగర్, గంగానగర్, జానకిరామ్‌నగర్, హెచ్‌ఎల్‌సీ కాలనీ, అరుణోదయ కాలనీలో ఇంటింటికీ కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా ఒకటో నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ట్రూఅప్ పేరుతో ప్రజలపై భారం వేస్తోందని దుయ్యబట్టారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, వలి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

చెన్నేకొత్తపల్లి: సర్కిల్ పరిధిలోని రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో కర్ణాటక మద్యం విక్రయించరాదని చెన్నేకొత్తపల్లి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఫరూక్ అజామ్ హెచ్చరించారు. సర్కిల్ పరిధిలోని పలు మండలాల్లో ఆదివారం దాడులు నిర్వహించారు. చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెలలో ఓబులమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకుని, ఆమె వద్ద నుంచి 60 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. అలాగే రామగిరి మండలం ముత్యాలమ్మపల్లిలో ముత్యాలన్నను అదుపులోకి తీసుకుని, 54 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ, ఎస్ఐ చెప్పారు. దాడుల్లో ఎస్ఐ శివప్రసాద్‌తో పాటు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు శంకర్‌నాయక్, రంగనాయకులు, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా 'రెడ్డి వివాహ పరిచయ వేదిక'

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డు పాపంపేటలోని రాయలసీమ రెడ్డి జన సంఘం కార్యాలయంలో ఆదివారం 'రెడ్డి వివాహ పరిచయ వేదిక' సందడిగా సాగింది. అనంతపురంతో పాటు కర్నూలు, బనగానపల్లి, హిందూపురం, మడకశిర, ధర్మవరం, గుత్తి ప్రాంతాల నుంచి దాదాపు 90 కుటుంబాలు హాజరయ్యాయి. పైసా ఆశించకుండా కేవలం సేవా దృక్పథంతో సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు రొద్దం సురేష్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు చంద్రమౌళి రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సెక్రెటరీ కిషోర్ రెడ్డి, ట్రెజరర్ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు మంత్రి విశ్వనాథ్ రెడ్డి, కోన వెంకట శివారెడ్డి, నందికొట్కూరు రమణారెడ్డి, కల్లూరు నాగరత్నంరెడ్డి, పోతిరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు

అనంతపురం: నగరంలోని నందమూరి నగర్‌లో బెల్టుషాపు నిర్వహించడానికి మద్యం బాటిళ్లు తీసుకెళ్తున్న ఈడిగ వెంకటేష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ కె.సాయినాథ్ తెలిపారు. నందమూరి నగర్‌కు చెందిన ఈడిగ వెంకటేష్ ఆదివారం రూ.7 వేల విలువైన 50 మద్యం క్వార్టర్ బాటిళ్లను తీసుకెళుతుండగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని వెంకటేష్‌ను అరెస్టు చేశారు. అతనిపై కేసు నమోదు చేశారు.

జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



రామగిరి: పేరూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కె.సి.మల్లికార్జున, మనీష్‌కుమార్ ఆదివారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మండలంలోని పరిస్థితుల గురించి వివరించారు.

చికెన్ సెంటరులో చోరీ

అనంతపురం: నగరంలోని ఐదో రోడ్డులో ఉన్న చికెన్ సెంటర్‌లో శనివారం రాత్రి చోరీ జరిగింది. త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. షేక్ రఫీక్ అనే వ్యక్తి ఐదో రోడ్డులో చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి కౌంటర్‌లో రూ.52,300 పెట్టి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. తర్వాత ఓ వ్యక్తి షట్టర్ బీగం పగులగొట్టి కౌంటర్‌లోని డబ్బు చోరీ చేశాడు. ఆదివారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన రఫీక్ సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించాడు. గతంలో ఇక్కడ పనిచేసిన జునేద్ అనే వ్యక్తి చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

15 నుంచి కడ్లే గౌరమ్మ ఉత్సవాలు



కడ్లే గౌరమ్మ (ఫైల్)

రాప్తాడు: భక్తుల కొంగు బంగారం కడ్లే గౌరమ్మ ఉత్సవాలను ఈ నెల 15 నుంచి మూడురోజులపాటు వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రాప్తాడులోని రామేశ్వర ఆలయంలో 15వ తేదీ ఉదయం పండమేరు వంక నుంచి గంగను డప్పు వాయిద్యాలు, నంది డోలు నడుమ తీసుకొచ్చి పూజలు చేస్తారు. 9 గంటలకు నోముల గౌరీదేవి, కడ్లే గౌరమ్మలను ప్రతిష్టిస్తారు. అనంతరం మహిళలు పెద్ద ఎత్తున మూలవిరాట్‌కు రుద్రాభిషేకం, గణపతి పూజ, ఉమామహేశ్వర పూజ, రుద్రాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళ హారతితో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 16వ తేదీన కడ్లే గౌరమ్మకు గౌరీదేవి రుద్రాభిషేకం, కుంకుమార్చన, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి, అదే రోజు రాత్రి 6 గంటల నుంచి మహిళలు, యువతులు గ్రామంలో చక్ర హారతులను ఆలయం వరకు తీసుకొచ్చి పూజలు చేస్తారు. 17న తెల్లవారుజామును 4 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు గౌరీదేవిని పూలరథోత్సవంలో కొలువుదీర్చి పురవీధుల గుండా ఊరేగించి 9 గంటలకు గ్రామంలోని పండమేరు వంకలో నిమజ్జనం చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ టీవీ శ్రీహర్ష గట్టి బందోబస్తు నిర్వహించనున్నారు.

అధికారులు హాజరు కావాలి

రాప్తాడు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు అన్ని శాఖల అధికారుల హాజరు కావాలని తహసీల్దార్ విజయకుమారి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గైర్హాజరయ్యే అధికారులపై కలెక్టర్‌కు నివేదిస్తామని పేర్కొన్నారు.

నేడు నీలకంఠేశ్వరునికి ప్రత్యేక పూజలు

రాప్తాడు: మండల కేంద్రంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస సోమవారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

నేడు ఎర్రితాత ఆలయంలో ప్రత్యేక పూజలు

రాప్తాడు: అయ్యవారిపల్లి ఎర్రితాత ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేసినట్లు పూజారి ఎర్రిస్వామి తెలిపారు.

మౌనగిరి క్షేత్రంలో పూజలు

రాప్తాడు: హంపాపురం సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేసినట్లు నిర్వాహకులు ఈశ్వరయ్యస్వామి తెలిపారు.

రైతు సమస్యలపై నేడు ధర్నా

కనగానపల్లి: రైతు సమస్యల పరిష్కారం కోసం సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సంఘం నాయకులతో పాటు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.